
సాక్షి వికారాబాద్

శనివారం । 28 । జూన్ । 2025



జీపీ కార్మికుల ఆందోళన

మూడు నెలలుగా వేతనాలు అందక పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



సాగు అగమ్యగోచరం

వరుణుడి జాడ లేకపోవడంతో వానాకాలం సాగు అగమ్యగోచరంగా మారిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



తోడేస్తున్నారు!

దోమ మండలంలో మట్టి దందా జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా తరలిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

సత్వరం పూర్తి చేయండి

కలెక్టర్ ప్రతీక్ జైన్



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేపట్టిన వివిధ మరమ్మతు పనులను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి అవసరమైన విభాగాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆస్పత్రిని తీర్చిదిద్దుకోవాలన్నారు. మరమ్మతు పనులు ఏ దశలో ఉన్నాయని పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివారెడ్డిపేటలోని గోదాంను పరిశీలించారు. మరమ్మతులు చేసి గోదాంను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డాక్టర్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుక్ చేసుకోండి



కొనసాగుతున్న కౌన్సెలింగ్

అనంతగిరి: పాలిసెట్ – 2025లో ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో ప్రవేశాల కోసం స్లాట్ బుక్‌చేసుకొని శని, ఆదివారాల్లో జరిగే ధ్రువపత్రాల పరిశీలనను హాజరు కావాలని జిల్లా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. 144 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకొని శుక్రవారం ధ్రువపత్రాల పరిశీలనకు 130 మంది హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

డీఎస్పీ శ్రీనివాస్



పరిగి పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పరిగి: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం పరిగి పట్టణంలోని పలు వీధుల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం నేరమన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తారని అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల సాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదు



పరిగి పట్టణంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

పరిగి: కాంగ్రెస్ మాట ఇస్తే తప్పక నెరవేరుస్తుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం పరిగి పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తోందన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఒక్క డబుల్ బెడ్‌రూం కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు చిన్న నర్సింలు, శ్రీనివాస్, చంద్రయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హస్తంలో అసంతృప్త సెగలు

కేడర్ నుంచి లీడర్ వరకు అదే పరిస్థితి

- నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల ఎదురుచూపులు
- ఏడాదిన్నర గడచినా ఒకటి అరతో సరి
- పార్టీ అంతర్గత సమావేశాల్లో నేతలను నిలదీస్తున్న వైనం

వికారాబాద్: హస్తం పార్టీలో అసంతుష్ట నేతలు పెరిగిపోతున్నారు. నామినేటెడ్ పదవులు ఆశిస్తూ వస్తున్న పలువులు ప్రభుత్వం ఏర్పాటయ్యి ఏడాదిన్నర దాటినా వారి ఆకాంక్ష తీరకపోవడంతో నిరాలో ఉన్నారు. ఈ జాబితా రోజురోజుకూ పెరిగిపోవడం ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారుతోంది. పదవులను ఆశించే వారిలో కేడర్ నుంచి లీడర్ వరకు ఉన్నారు. జిల్లాలో ఇది ఒక్క నియోజకవర్గానికో పరిమితం కాకుండా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో అదే పరిస్థితి కనిపిస్తోంది. పదవుల పందేరంలో చోటు దక్కకపోవడంతో నేతల నిరీక్షణ కాస్త పార్టీలో లుకలుకలకు దారితీస్తోంది. ప్రస్తుతం పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నిర్వహిస్తున్న అంతర్గత సమావేశాల్లో అసంతృప్తి నేతలు గళం విప్పుతున్నారు. ఇది పార్టీ పెద్దలకు మింగుడు పడటం లేదు. ఆశావహుల్లో ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. ఎవరికి వారు.. ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పెద్ద నాయులు దేశ రాజధాని ఢిల్లీ స్థాయిలో పావులు కదుపుతుండగా గల్లి నేతలు రాష్ట్ర రాజధాని గాంధీ భవన్‌లో ప్రయత్నాలు చేస్తున్నారు.

పెద్ద నేతలు సైతం..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లా నేతకే సీఎం పదవి దక్కింది. సీఎం పదవి తోపాటు శాసన సభ స్పీకర్ పీఠం కూడా జిల్లాకు చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్‌కే దక్కింది. అయితే జిల్లాకు చెందిన పెద్ద నాయకులు ఇంకా పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి రాష్ట్రస్థాయి పోస్టు దక్కగా అదే నియోజకవర్గానికి చెందిన మరో నాయకుడికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కట్టబెట్టారు. సీఎం నియోజకవర్గంలో ఈ రెండు పదవులు మినహా జిల్లా నేతలకు ఇంకే ఇతర పెద్ద పదవులు దక్కలేదు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుత క్యాబినెట్‌లో కూడా ఆయన పోర్టుపోలియోను ఆశించారు. సామాజిక వర్గాల ప్రాతిపదికగా జరిగిన ఈక్వేషన్‌లో ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం కుదరలేదు. దీంతో స్పీకర్ పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. క్యాబినెట్ హోదాతో పోలిస్తే ప్రోటోకాల్ పెద్దదే అయినా ఆయన మంత్రి పదవికే మొగ్గు చూపారు. ఇటీవలి జరిగిన మంత్రివర్గ విస్తరణలోనూ పదవి దక్కుతుందని ఆశించారు. కానీ నిరాశే మిగిలింది. ఇక జిల్లాకు చెందిన మరో సీనియర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు అయిన టీ రామ్మోహన్‌రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. 2014 మరియు 2018తో పాటు 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున రెండు సార్లు గెలుపొందిన వారందరు ప్రస్తుతం మంత్రి వర్గంలో ఉన్నారు. ఒక్క నాకు మాత్రమే ఆ అవకాశం దక్కలేదని ఆయన పేర్కొంటున్నారు. గడచిన రెండు దశాబ్దాల ముందు నుంచే ఎలాంటి గడ్డు పరిస్థితిలోనైనా పార్టీని వీడకుండా నమ్మకంగా ఉన్న నాకు కూడా మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన ఆయన ఇదే విషయం అధిష్టానం ముందుంచారు. మరో నాయకుడు రఘువీరారెడ్డి సైతం నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని కోరుతూ వస్తున్నారు. ధారూరు మండలంలో తాజాగా జరిగిన క్షేత్రస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయనకు పదవి ఇవ్వాలని పలువురు నాయకులు నిరసన తెలిపారు. దీంతో సమావేశం గందరగోళంగా మారింది. రోడ్డుపై ధర్నా చేసే దాకా ఈ వ్యవహారం నడిచింది.

పెరుగుతున్న ఆశావహులు

జిల్లాలో ఆశావహులు, అసంతుష్టులు పెరిగిపోతున్నారు. మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి తప్ప జిల్లా నేతలకు పెద్దగా నామినేటెడ్ పదవులు దక్కలేదు. పరిగి నియోజకవర్గంలో సీనియర్ నాయకులు హన్మంతు ముదిరాజ్, లాల్ కృష్ణప్రసాద్, అశ్రఫ్, చంద్రయ్య, శ్రీనివాస్ తదితరులు పదవులు ఆశిస్తూ వస్తున్నారు. తాండూరులో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డికే ముందుగా కాంగ్రెస్ టికెట్ ఇస్తారనే ప్రచారం జరగ్గా చివరి నిమిషంలో మనోహర్‌రెడ్డి రంగప్రవేశం చేశారు. దీంతో మంచి స్థానం కల్పిస్తామని శ్రీనివాస్‌రెడ్డిని అప్పట్లో సముదాయించారు. ఆయనకు కూడా ఇప్పటి వరకు ఏ పదవి దక్కలేదు. ఇతర సీనియర్ నాయకులు పురుషోత్తంరావ్, అబ్దుల్ రహూఫ్, విజయాదేవి, నర్సింహులు, స్వప్నపరిమళ్ కూడా పదవులు ఆశిస్తున్న వారిలో ఉన్నారు. వికారాబాద్‌లో సుధాకర్ రెడ్డి, రఘువీరారెడ్డి, రాంచంద్రారెడ్డి, కిషన్‌నాయక్, నరోత్తంరెడ్డి, కొండల్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు కూడా పదవులపై ఆశలు పెట్టుకున్నారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన నందారం ప్రశాంత్, మహ్మద్ యూసుఫ్, ముద్దప్ప తదితరులు ఆశావహుల జాబితాలో ఉన్నారు.



రఘువీరారెడ్డికి పదవి లేకుంటే మాకూ వద్దు

వైస్ చైర్మన్ పదవికి అశోక్ ముదిరాజ్ రాజీనామా

ధారూరు: పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డికి పదవి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగనపల్లి అశోక్ ముదిరాజ్ తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు రఘువీరారెడ్డి పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఆయనకు రాష్ట్రస్థాయిలో చోటు కల్పించకపోవడం సరికాదన్నారు. రఘువీరారెడ్డికి పదవి ఇచ్చే వరకు తాను కూడా పదవిలో ఉండబోనని స్పష్టం చేశారు. వికారాబాద్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గెలుపునకు రఘువీరారెడ్డి ఎంతో శ్రమించారని తెలిపారు. అలాంటి వ్యక్తిని విస్మరించడం సరికాదన్నారు. రాష్ట్రస్థాయి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సంక్షేమానికి పెద్దపీట



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

అనంతగిరి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదలకు అనేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిని అభివృద్ధి చేస్తా

అనంతగిరిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. స్వదేశీ దర్శన్ ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం వికారాబాద్ పట్టణంలో అనంతగిరి గుట్టపై పర్యాటకులకు రూ.6 కోట్లతో తాగు నీటి పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి సమీపంలో అనంతగిరులు ఉండటంతో అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, మాజీ కౌన్సిలర్ మురళి, సీనియర్ నాయకులు రంగరాజు, బాదం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ భగీరథ నీరు అందాలి



మిర్జాపూర్‌లో రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడుతున్న శ్రీధర్

- రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్

పరిగి: మండలంలోని ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ సూచించారు. శుక్రవారం జాఫర్‌పల్లిలోని మిషన్ భగీరథ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉంటుందన్నారు. అనంతరం పూడూరు మండలంలో మీర్జాపూర్ రోడ్డు పనులను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ, చెత్త సేకరణపై ఆరా తీశారు. ఇక్కడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలపై సత్వరం స్పందించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వాలని డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ కోరగా ప్రిన్సిపల్ సెక్రటరీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

సైన్స్ టీచర్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- యూటీఎఫ్ నేతల డిమాండ్
- పాఠశాలను సందర్శించి వివరాల సేకరణ

యాలాల: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ టీచర్ ఖాసీం బీపై పెట్టిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ వెంకటరత్నం, రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి హెచ్‌ఎంతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాఠ్యాంశ బోధనలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చనిపోయిన జంతువు మెదడును ప్రదర్శించిందన్నారు. ఈ విషయంలో పాఠ్యాంశానికి, పాఠశాలకు సంబంధం లేని వ్యక్తులు ఆందోళన చేసి స్కూల్ వాతావరణాన్ని చెడగొట్టారన్నారు. శాస్త్రీయ పద్ధతిలో అంకిత భావంతో ప్రయోగాత్మక పద్ధతిలో బోధించే టీచరును సస్పెండ్ చేయడాన్ని వారు తప్పుబట్టారు. ఇది అనాలోచిత చర్యగా వారు పేర్కొన్నారు. ఖాసీం బీ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని వారు కోరారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహులు, కోశాధికారి మూవీస్కాన్, కార్యదర్శులు బాబురావు, సలీం రత్నం, కృష్ణవేణి, వెంకటయ్య, శివరాజ్, మల్లేశం, పరశురాం, భానుచైతన్య, గుడుమియా తదితరులు పాల్గొన్నారు.

సామగ్రి కొనుగోలులో చేతివాటం

- మాజీ కౌన్సిలర్ సంగీత ఆరోపణ
- వివరాలు ఇవ్వాలంటూ స.హ. చట్టం కింద దరఖాస్తు

తాండూరు టౌన్: తాండూరు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పరిరక్షణ సామగ్రి కొనుగోలులో గోల్‌మాల్ జరిగిందని మాజీ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ ఆరోపించారు. శుక్రవారం సమాచార హక్కు చట్టం కింద వివరాలను ఇవ్వాలంటూ మున్సిపల్ పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికులకు సామగ్రి కొనుగోలు కోసం పెద్ద మొత్తంలో రూ.40 లక్షల నిధులను వెచ్చించాలని గత కౌన్సిల్‌లో చర్చ జరిగినప్పుడు, వారికి ఖర్చు చేసే నిధులపై అభ్యంతరం తెలిపామన్నారు. అలాంటిది ఇట్టి నిధులకు మరో రూ.10లక్షలు కలిపి మొత్తం రూ.50 లక్షలతో సామగ్రి కొనడం విడ్డూరమన్నారు. మహిళా కార్మికుల కోసం రూ.1800 పెట్టి ఒక్కో చీర కొనుగోలు చేశామని చెప్పడంలోనే అసలు స్కాం బయట పడిందన్నారు. అంతేకాకుండా ఇతర సామగ్రి కొనుగోలులో కూడా స్కాం జరిగినట్లు తెలుస్తోందన్నారు. కావున జరిగిన అవినీతిని బయట పెట్టేందుకే ఆర్టీఐ ద్వారా దరఖాస్తు దాఖలు చేశానని ఆమె తెలిపారు.



ఆర్టీఐ దరఖాస్తును చూపుతున్న మాజీ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్

ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేద్దాం

- పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు
- డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్



పాల్గొన్న పోలీస్ అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఏఎస్పీ మురళీధర్

అనంతగిరి: ఆపరేషన్ ముస్కాన్–11ను విజయవంతం చేయాలని డీటీసీ అదనపు ఎస్పీ పీవీ మురళీధర్ పిలుపునిచ్చారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆపరేషన్ ముస్కాన్‌పై రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి కార్మిక, స్త్రీశిశు సంక్షేమ శాఖ, పోలీస్, బాలల సంక్షేమం, సమితి, రెవెన్యూ, విద్య, పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై ఒకటవ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేయాలన్నారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చాలని సూచించారు. బాల్యవివాహాలను అరికట్టాలని, పిల్లలతో భిక్షాటన చేయించకుండా చూడాలని ఆదేశించారు. పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. బడీడు పిల్లలను చదువుకోనివ్వాలని, వీధి బాలలను రక్షించాలన్నారు. మానవ అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్ –11 కోసం ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్ పాషా ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ బృందాలు జిల్లా అంతటా నిరంతరం తిరుగుతూ బాల కార్మికులను గుర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటేశం, సభ్యులు ప్రకాష్, సంగమేశ్వర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జి.కాంతారావు, శ్రీకాంత్, నరేష్ కుమార్, రాజునాయక్, సంతోష్ రెడ్డి, యశోద తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

తుర్కయంజాల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ అన్నారు. పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లో శుక్రవారం సీఐ గురునాయుడుతో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ప్రమాదాల బారిన పడ్డప్పుడు తలకు బలమైన గాయాలు తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. హెల్మెట్ ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని చెప్పారు. అనంతరం హెల్మెట్ లేకుండా సాగర్ రహదారిపై ప్రయాణిస్తున్న వారికి చలాన్లకు బదులు కొత్త వాటిని కొనుగోలు చేయించారు. ఆయన వెంట ఎస్ఐ సాయినాథ్ ఉన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్

రాసుకొని వెళ్లిపోతారని అనుకోకండి



ఉపాధి హామీ పథకం పనులపై చర్చిస్తున్న అధికారులు

- అక్రమాలు తేలితే కఠిన చర్యలు
- డీఆర్‌డీఏ ఏపీడీ సరళ
- తాండూరులో ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

తాండూరు రూరల్: ఉపాధి హామీ పథకం పనుల వివరాలు తెలుసుకునేందుకు వచ్చే అధికారులు కేవలం రాసుకొని వెళ్లిపోతారు అనుకుంటే పొరపాటని అక్రమాలు తేలితే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఏ ఏపీడీ సరళ హెచ్చరించారు. శుక్రవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 2024 జనవరి నుంచి 2025 మార్చి వరకు రూ.6.42 కోట్ల విలువ చేసే పనులు చేపట్టారు. వీటిపై 16 బృందాలతో 33 గ్రామాల్లో ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రూ.3 లక్షల 5 వేల 733 రికవరీకి చేశామని తెలిపారు. అదేవిధంగా రూ.24 వేలు ఫైన్ వేసినట్లు వివరించారు. బినామీ పేర్లతో పనులు చేసినట్లు గుర్తించామన్నారు. రికార్డు నమోదు కూడా సక్రమంగా చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, అంబుడ్స్‌మెన్ రాములు, విజిలెన్స్ ఆఫీసర్ భార్గవి, ఏపీఓ నరోత్తంరెడ్డి, ఆపరేటర్ అమృత, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్



సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎస్‌ఐ రమేష్

కుల్కచర్ల: దుకాణదారులు ప్రతీ ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద కెమెరాలతో సమానమన్నారు. రోడ్డు ప్రమాదాలు, చోరీలు జరిగిన సమయంలో నిందుతులను సులువుగా పట్టుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదం

ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. యాచారం మండలం గడ్డమల్లయ్యగూడకు చెందిన దార మహేందర్ బైక్‌పై వండల్ లా జంక్షన్ నుంచి కొంగరకలాన్‌వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లే టీ జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీ ఒక్కసారిగా కుడివైపునకు మలుపు తిప్పాడు. దీంతో వెనుకాల వస్తున్న బైక్ లారీ ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు కిందపడిపోయి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్క స్వైర విహారం



వీధికుక్క దాడిలో గాయపడిన హర్షవర్ధన్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వాచ్య తండా గ్రామ పంచాయతీ దేవులనాయక్ తండాలో శుక్రవారం వీధికుక్క స్వైర్య విహారం చేసింది. తండాకు చెందిన ముగ్గురు వ్యక్తులపై దాడిచేసి, గాయపరిచింది. మేకలు, కోళ్ల వెంటపడుతున్న కుక్కను నేనావత్ చందర్, సబావత్ సక్రీబాయ్ అదిలించే ప్రయత్నం చేయగా వారిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిందని స్థానికులు తెలిపారు. పక్కనే ఉన్న ముడావత్ హర్షవర్ధన్(5)పై దాడిచేసి గాయపరిచిందని పేర్కొన్నారు. కుక్కల దాడిలో గాయపడిన వారిని చికిత్స కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

హుండీ చోరీకి విఫలయత్నం



హుండీ చుట్టూ సిమెంట్ తవ్విన ఆనవాళ్లు

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని దుండగులు దర్గాలో హుండీ చోరీకి విఫలయత్నం చేశారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. చర్లపటేల్‌గూడకు వెళ్లే మార్గంలోని జహంగీర్‌పీర్‌దర్గా వద్ద హుండీని భూమిలోకి ఉంచి చుట్టూ సిమెంట్‌తో ఏర్పాటు చేశారు. ఈ హుండీని పెకిలిచేందుకు గుర్తు తెలియని దుండుగుల చుట్టూ ఉన్న సిమెంట్ తవ్వారు. ప్రయత్నం విఫలమవడంతో మధ్యలోనే వదిలి వెళ్లారు. దుండగుల ఆచూకీకి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

జీతాల కోసం | జీపీ కార్మికుల ఆందోళన

మూడు నెలలుగా అందని వేతనాలు

- పస్తులుంటున్నామంటూ ప్రభుత్వంపై ఆగ్రహం
- పంచాయతీ రాజ్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన సీఐటీయూ
- ముందస్తుగా అరెస్ట్ చేసిన పోలీసులు

దోమ: పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారి పస్తులుండాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటర్ మెన్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, కారోబార్‌ల ఇదే పరిస్థితి అని వాపోతున్నారు. ప్రస్తుతం మండల పరిధిలో 118 మంది కార్మికులకు ప్రతీ నెల రూ.9,500 వేతనం చెల్లిస్తున్నారు. పెరిగిన ఖర్చుల రీత్యా తమ వేతనాలు పెంచాలని ఓ వైపు డిమాండ్ చేస్తుంటే ప్రస్తుత వేతనం కూడా సమయానికి ఇవ్వక అప్పులపాలు కావాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ నెల రూ.20వేల కనీస వేతనం ఎస్టీఓ ద్వారా చెల్లించడం, ఉద్యోగ భద్రత కల్పించడం, ప్రమాదబీమాల అలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సీఐటీయూ పిలుపుమేరకు శుక్రవారం నగరంలోని పంచాయతీ రాజ్ కార్యాలయం ముట్టడికి వెళ్లేందుకు జిల్లా కార్మికులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు జీపీ కార్మికులను ముందుస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.



పంచాయతీరాజ్ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న కార్మికులను అరెస్ట్ చేసిన పోలీసులు

కుటుంబ పోషణ భారం



ప్రతి నెలా జీతాలు రాక కుటుంబ పోషణ భారంగా మారింది. పూట గడవలేని స్థితిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చాలీచాలని జీతాలతో జీపీ కార్మికులుగా పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన కనీస వేతనం రూ.20 వేలు అందించి ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

– టి.వెంకటయ్య, కార్మికుడు, గొడుగోనిపల్లి

ప్రభుత్వ వైఫల్యమే



జీపీ కార్మికులను పట్టించుకోకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. నిత్యం పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. వారికి వేతనాలు ఇవ్వడంలో విఫలమవుతున్నారు. అరకొర జీతాలతో కుటుంబాలను పోషించుకోలేని దుస్థితి. ప్రభుత్వం కార్మికులకు ప్రత్యేక గ్రాంట్‌ను మంజూరు చేసి కనీస వేతనం అందించేందుకు చర్యలు తీసుకోవాలి. – పీర్ మహమ్మద్, సీపీఐ డివిజన్ కార్యదర్శి

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మైపాల్‌రెడ్డి తదితరులు

పూడూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుందామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని రెగడి మామిడిపల్లి, బార్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మైపాల్‌రెడ్డి తన అనుచరులతో కలిసి మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం బార్లపల్లిలోని హనుమాన్ ఆలయానికి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజహారుద్దీన్, నాయకులు అదీముద్దీన్, రైస్‌ఖాన్, రాజేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, పోలీసుల అదుపులో లాల్ మహమ్మద్

తాండూరు: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన శుక్రవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కేసు వివరాలను తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి విలేకరులకు వెల్లడించారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలోని యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన లాల్ మహ్మద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు తాండూరు సీఐ సంతోశ్‌కుమార్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఆయన తన సిబ్బంది ఎస్‌ఐ అంబర్యా, హెడ్ కానిస్టేబుల్ అమ్జద్, శివకుమార్, కానిస్టేబుల్స్‌తో కలిసి రైల్వే స్టేషన్ ఎదుట తనిఖీలు చేపట్టారు. ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అతన్ని అదుపులోకి తీసుకుని బ్యాగును తనిఖీ చేయగా 1.2 కిలోల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

టీచర్ సస్పెన్షన్ సరికాదు

- వెంటనే రద్దు చేయాలి
- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

అనంతగిరి: యాలాల మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్(బాలికల) పాఠశాలకు చెందిన బయోసైన్స్ టీచర్ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్, డీఈఓలకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన పదో తరగతి పాఠ్యాంశాలలోని సమన్వయ నియంత్రణ అనే పాఠ్యాంశానికి సంబంధించిన పాఠ్యబోధన సందర్భంలో సదరు ఉపాధ్యాయురాలు ఎస్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన చనిపోయిన పశువు శరీరభాగాలలోని మెదడును పాఠ్యాంశ బోధన ఉపకరణాలుగా వాడటం తప్పుకాదని విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుటకు ఉపయోగపడే సాధనంగానే చూడాలన్నారు. అధికారులు వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలన్నారు.



ఒకే భవనం.. రెండు కార్యాలయాలు

గదిలో అంగన్‌వాడీ.. వరండాలో గ్రామ పంచాయతీ

మండల పరిధిలోని సత్తర్‌కుంట తండాలో ఒకే గదిలో రెండు కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. తండాలను పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేసిన సమయంలో తండాలో ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రంలో తాత్కాలికంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఉన్న ఒక్క భవనంలో సగభాగం అంగన్‌వాడీ కేంద్రం, మరో సగంలో పంచాయతీకి సంబంధించిన సామగ్రిని ఏర్పాటు చేశారు. దీంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీకి సొంత భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని తండావాసులు కోరుతున్నారు. – దుద్యాల్

26 రోజులు..3,353 కేసులు!

'నిషా'చరులపై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే 'నిషా'చరులపై ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తున్నారు. ఈ నెలకు సంబంధించి గురువారం (26వ తేదీ) వరకు చేపట్టిన తనిఖీల్లో మొత్తం 3,353 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కినట్లు ట్రాఫిక్ విభాగం సంయుక్త సీపీ జోయల్ డెవిస్ శుక్రవారం వెల్లడించారు. అంతకు ముందు చిక్కిన వారితో కలిపి మొత్తం 5,321 మందిపై కోర్టుల్లో అభియోగపత్రాలు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో 133 మందికి న్యాయస్థానం జైలు శిక్ష విధించిందని, బుధవారం ఒక్క రోజే ఏకంగా 38 మంది జైలుకు వెళ్లారని జోయల్ డెవిస్ తెలిపారు. మొత్తం 133 మందిలో ముగ్గురికి 14 రోజులు, ఇద్దరికి పది రోజులు, 128 మందికి ఒక రోజు నుంచి ఆరు రోజుల వరకు జైలు శిక్షలు పడ్డాయని వివరించారు. ఈ ఉల్లంఘనులకు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కౌన్సిలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరుపరుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జైలుకు వెళ్లిన వారితో సహా మొత్తం అందరికీ కలిపి కోర్టు రూ.1,14,87,600 జరిమానా విధించినట్లు ప్రకటించారు.

అప్పులు తీర్చేందుకు చోరీల బాట

- సీసీ కెమెరాలకు చిక్కిన నిందితులు
- అన్నదమ్ములకు రిమాండ్



నరేష్, వెంకటేష్ (ఫైల్)

యాచారం: ప్రైవేట్ ఉద్యోగస్తులైన ఇద్దరు అన్నదమ్ములు అప్పులు తీర్చేందుకు చోరీల బాట పట్టారు. చివరకు సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులకు చిక్కారు. ఈ మేరకు శుక్రవారం వారిని రిమాండ్‌కు తరలించారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన నరేశ్, ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లికి చెందిన వెంకటేశ్ వరుసకు అన్నదమ్ములు. ఈ నెల 23న మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన బండ పార్వతమ్మ నక్కర్తమేడిపల్లిలో బంధువుల ఇంటికి వచ్చి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో తక్కళ్లపల్లి గేట్ వద్ద బస్సు ఎక్కేందుకు రోడ్డుపై వేచియుంది. ఈ క్రమంలో ఆమె ఒంటరిగా ఉందని గమనించిన అనదమ్ము లు హెల్మెట్లు ధరించి బైక్‌వచ్చి పార్వతమ్మ మెడలోంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెల్లారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసు లు శుక్రవారం వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. ఈ మేరకు వారి వద్ద నుంచి అపహరించిన పుస్తెలతాడును స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

గోదాం పైనుంచి పడి కూలీ మృతి

హయత్‌నగర్: రేకుల షెడ్డు పైకప్పు నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన హయత్‌నగర్ ఠాణా పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కొహెడకు చెందిన పొట్లచెరువు మల్లేశ్(55) తోటి కార్మికులతో కలిసి శుక్రవారం ఉదయం స్థానికంగా ఉన్న ఓ విత్తనాల కంపెనీ గోదాం పైకప్పు రేకులను మార్చే పని చేస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిని చిదిమేసిన టిప్పర్ లారీ

తల్లి కళ్లెదుటే ఆరేళ్ల బాలుడి దుర్మరణం

దుండిగల్: రెప్పపాటు క్షణంలో ఆరేళ్ల బాలుడు ప్రాణాలు వదిలాడు. తన కళ్లెదుటే కుమారుడు విగత జీవిగా మారడంతో ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించడం స్థానికుల హృదయాలను కలచివేసింది. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ జిల్లా కేశవాపూర్ ప్రాంతానికి చెందిన రాజురెడ్డి, నిహారిక రెడ్డి దంపతులు కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి మల్లంపేటలోని ఆకాశ్ లేఅవుట్‌లో నివాసముంటున్నారు. రాజురెడ్డి ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా నిహారిక రెడ్డి గృహిణి. వీరికి అభిమన్యు రెడ్డి (6), మరో చిన్నారి సంతానం. అభిమన్యు రెడ్డి బౌరంపేటలోని గీతాంజలి స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే నిహారిక శుక్రవారం ఉదయం 8 గంటలకు కుమారుడిని స్కూల్ వద్ద దింపేందుకు స్కూటీపై బయలుదేరింది. ఈ క్రమంలో ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ఎదురుగా వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిహారిక ఎడమ వైపు పడగా.. అభిమన్యు కుడి వైపు రోడ్డుపై పడడంతో టిప్పర్ లారీ వెనుక టైరు బాలుడి తలపై నుంచి వెళ్లింది. దీంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగు అగమ్యగోచరం

- పత్తాలేని వరుణుడు
- ఎండుతున్న మొలకలు



మోమిన్‌పేటలోని ఎన్కేపల్లిలో పలుచగా మొలిచిన పత్తి మొక్కలు

మోమిన్‌పేట: వరుణుడి జాడ లేకపోవడంతో వానాకాలం సాగు అగమ్యగోచరంగా మారిందని రైతన్నలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మృగశిర కార్తెలో కురిసిన చిన్నపాటి వర్షాలకు కొంతమంది పత్తి విత్తనాలు నాటారు. ఆతర్వాత పదిహేను రోజులు గడిచినా వాన లేకపోవడంతో మొలకలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. సరైన తేమ లేకపోవడంతో 50నుంచి 60 శాతం మాత్రమే మొలకలు వచ్చాయని, ప్రస్తుతం ఇవి కూడా ఎండిపోతున్నాయని దిగులు చెందుతున్నారు. ఆకాశంలోని మేఘాలు నిత్యం ఊరిస్తున్నాయే తప్ప చినుకు కురవడం లేదని పేర్కొంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వానలు పడుతాయని వాతావరణ శాఖ పేర్కొంటున్నా ఫలితం కనిపించడం లేదంటున్నారు. ఇలాంటి పరిస్థితిని ముందెన్నడూ చూడలేదని, మళ్లీ విత్తనాలు వేయాలంటే రెండింతల పెట్టుబడి అవుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వైద్య చికిత్సలతో టీబీ దూరం



టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది

డాక్టర్ కిరణ్‌గౌడ్

కుల్కచర్ల: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఏడాది పాటు మందులు వాడితే టీబీని పూర్తిగా నివారించవచ్చునని మండల వైద్యాధికారి కిరణ్‌గౌడ్ అన్నారు. టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చౌడాపూర్ సబ్ సెంటర్‌లో క్షయ, రక్తపోటు, మధుమేహం, హెచ్ఐవీ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ.. టీబీ సోకిన వారు ఏడాది పాటు మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ.. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రతీ నెల రూ.1,000 పౌష్టికాహారం కోసం అందజేస్తుందన్నారు. ఆరు నెలల పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీబీ అధికారి రవీంద్రయాదవ్, టీబీ హెల్త్ విజిటర్ రాజు నాయక్, మెడికల్ అసిస్టెంట్ అంజూ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సిబ్బంది యాదమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మట్కారాయుళ్ల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

తాండూరు: పట్టణంలోని ప్రధాన కూడలిలో మట్కానిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన శుక్రవారం తాండూరు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ సంతోశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ సత్తార్, ఇందిరమ్మ కాలనీకి చెందిన మహ్మద్ షఫీ మధ్యాహ్నం వినాయక చౌక్ కూడలి ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీలు చేపట్టగా రూ.4,210 నగదు మట్కా చిట్టీలు లభ్యమయ్యాయి. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

పాఠశాల స్థలంలో ఇళ్ల నిర్మాణం



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

కూల్చివేయించిన రెవెన్యూ అధికారులు

చేవెళ్ల: ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య హెచ్చరించారు. నాంచేరి రెవెన్యూ పరిధిలోని ఇంద్రారెడ్డి నగర్‌లో ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఏడు ఇళ్లను శుక్రవారం పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఇంద్రారెడ్డి నగర్‌లో ప్రభుత్వ పాఠశాలకు సర్కార్ 2.20 ఎకరాల స్థలం కేటాయించింది. ఇక్కడ ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. చుట్టూ ఖాళీ స్థలం ఉండడంతో ఏడుగురు స్థానికులు ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐలు చంద్రమోహన్, పవన్, సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్ఐ సంతోష్‌కుమార్ వెళ్లి నిర్మాణాలను కూల్చివేశారు. ఈ కూల్చివేతల్లో రెవెన్యూ సిబ్బంది నర్సింలు, ప్రకాశ్, ఆంజనేయులు, రవీందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ నిర్మాణాల్లో అధికార పార్టీకి చెందిన నాయకుడి కుమారుడి ఇళ్లు ఉండడం విశేషం.

బందోబస్తు మధ్య గుడిసె తొలగింపు



మోత్కులగూడలో గుడారాన్ని తొలగిస్తున్న గ్రామ పంచాయితీ సిబ్బంది

మోత్కులగూడలో ఉద్రిక్త పరిస్థితులు

- సదరు స్థలంలోకి ఎవరూ వెళ్లొద్దన్న అధికారులు

నందిగామ: మోత్కులగూడలోని ఓ వివాదాస్పద స్థలంలో ఏర్పాటు చేసిన గుడిసెను గ్రామ కార్యదర్శి చెన్నయ్య శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ స్థలాన్ని గతంలో ప్రభుత్వం మాకే కేటాయించిందని ఒకరు, కాదు మాకే కేటాయించిందని మరొకరు గొడవ పడుతున్నారు. ఇరువురి మధ్య నెలకొన్న ఈవివాదం చినికిచినికి గాలివానలా మారడంతో రాజకీయ రంగు పులుముకుంది. ఈ స్థలంలో ఓ వ్యక్తి ఇటీవల ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోయగా, ఆ స్థలం తమదేనని, తనకు పట్టాతో పాటు, ఏళ్ల తరబడి కబ్జాలో ఉన్నామని మరో వ్యక్తి నిర్మాణాన్ని అడ్డుకున్నాడు. ఇరవై రోజులుగా ఈ పంచాయితీ కొనసాగుతోంది. ఇరువురూ ఒకరిపై ఒకరు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. తనకు పట్టా ఉందని చెబుతున్న వ్యక్తి సదరు స్థలంలో ఇటీవల గుడిసె వేశారు. దీన్ని తొలగించాలని కోరుతూ మరో వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో శుక్రవారం గ్రామ కార్యదర్శి చెన్నయ్య స్థానిక పోలీసుల బందోబస్తు మధ్య గుడిసెను తొలగించారు. ఈసమయంలో ఘర్షణ వాతావరణం నెలకొన్నప్పటికీ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ సుమతిని వివరణ కోరగా.. ఇరువురు వ్యక్తులు ప్లాట్లు తమవేనంటున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టా సర్టిఫికెట్లు, లే అవుట్ మ్యాప్‌ను పరిశీలించి ప్లాటు ఎవరిదో నిర్ధారిస్తామని, అప్పటివరకు ఎవరూ అందులోకి వెళ్లకూడదని చెప్పామన్నారు.